ఎరువుల పంపిణీలో ఆంక్షలు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్బీకేల్లో సరఫరా
- కూటమి ప్రభుత్వంలో మారిన విధానం
- ముందుగా నగదు చెల్లించాల్సిందే..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

2019 – 24 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలిచింది. పెట్టుబడి సాయం చేసింది. ఆర్బీకేలు పెట్టి ఆదుకుంది. అన్నదాతలకు ఉపయోగపడే పనుల విషయంలో ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు మారిపోయాయి. రైతన్నలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

వెంకటాచలం: మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు కెనాల్ ఆయకట్టు కింద సుమారు 50 వేల ఎకరాల్లో రబీ సీజన్‌లో ఏటా రైతులు వరిసాగు చేస్తుంటారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా సాగుకు అవసరమైన ఎరువులు, వ్యవసాయానికి సంబంధించి సలహాలు, సూచనలు అందించింది. మండలంలో 25 గ్రామ పంచాయతీలుండగా, 20 చోట్ల ఆర్బీకేలను పెట్టారు. సకాలంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. దీంతో ఐదు సంవత్సరాలపాటు ఎరువుల కోసం ప్రైవేట్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం రాలేదు. అలాగే అవసరమైన వరి విత్తనాలతో పాటు, యూరియా, డీఏపీ, పొటాష్ తదితరాలను ముందస్తుగానే తీసుకొచ్చి సరఫరా చేసిన పరిస్థితులున్నాయి. దీంతో అన్నదాతలకు అదనపు భారం తగ్గింది.

అక్కడికి వెళ్లాల్సిందే..

ప్రస్తుతం మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తిక్కవరప్పాడు, కంటేపల్లి, రామదాసుకండ్రిగ, గొలగమూడి, కనుపూరు తదితర గ్రామాల్లో వరినాట్లు సాగుతున్నాయి. మరి కొద్దిరోజుల్లో మిగిలిన గ్రామాల్లోనూ ప్రారంభం కానున్నాయి. అయితే రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు ప్రైవేట్ దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఆర్బీకేల్లో ముందుగానే ఎరువులను నిల్వ ఉంచి, రైతుల అవసరాలకు తగ్గట్లుగా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ముందుగా ఒక లారీ లోడు (300 బస్తాలు) చెల్లింపులు పూర్తయిన తర్వాత ఎరువులు తెప్పిస్తామని సిబ్బంది చెబుతున్నారు. నాడు యూరియా బస్తా ధర రూ.266 ఉండగా నేడు మండలంలోని ప్రైవేట్ దుకాణాల్లో రూ.300 నుంచి రూ.330 వరకు విక్రయిస్తున్నారు. ఆటో బాడుగ అదనం. దీంతో రైతాంగంపై భారం పడింది.



నేడిలా..

కూటమి ప్రభుత్వంలో ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. వీటి నుంచి అన్నదాతలకు అందుతున్న సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, పిల్లిపెసర, జీలగలను అరకొరగా పంపిణీ చేశారు. రైతులు పలు దఫాలు కేంద్రాల చుట్టూ తిరిగినా సబ్సిడీ విత్తనాలు సరిపడా రాలేదని సిబ్బంది చెప్పేవారు.

ఎరువులు పంపిణీ చేయాలి



రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేయాలి. గతంలో ఆంక్షలు లేకుండా ఆర్బీకేల్లోనే సరఫరా చేసేవారు. ప్రస్తుతం ముందుగా నగదు చెల్లించాలని చెప్పడం సరికాదు. అధికారులు జోక్యం చేసుకుని ముందస్తుగానే ఎరువులు నిల్వ ఉంచాలి.

– శివకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, ఇస్కపాళెం

రైతులపై భారం మోపొద్దు



గతంలో మాదిరిగానే రైతులకు సేవలందించాలి. ఎరువుల సరఫరా విషయంలో ఆంక్షలు విధించి అదనపు భారం మోపొద్దు.

– ముంగర శ్రీనివాసులు, తిరుమలమ్మపాళెం

పంపిణీ చేస్తాం

రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తాం. అయితే గతంలో మాదిరిగా ముందుగా నిల్వ చేయకుండా, రైతులు నగదు చెల్లిస్తే తెప్పిస్తాం. ఒక లోడుకు సరిపడా చెల్లింపులు జరిపితే వెంటనే తెప్పించి పంపిణీ చేస్తాం.

– హరి కరుణాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖాధికారి

క్లుప్తంగా

అనారోగ్యంతో శ్రీనివాసులురెడ్డి మృతి


శ్రీనివాసులురెడ్డి (ఫైల్)

తోటపల్లిగూడూరు: సీనియర్ రాజకీయ నాయకుడు టంగుటూరు పెద్ద శ్రీనివాసులురెడ్డి (78) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈదూరు పంచాయతీకి చెందిన ఈయన గతంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా, కో– ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా పనిచేశారు. సుమారు 30 ఏళ్లపాటు మండల రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. శ్రీనివాసులురెడ్డి అంత్యక్రియను శనివారం ఉదయం ఈదూరు గ్రామంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కార్తీక మాస పూజలు



పొదలకూరు: పట్టణంలోని అమరావతి స్కూల్లో శుక్రవారం కార్తీక మాస ప్రత్యేక పూజలు, వనభోజనాలను నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ కె.సురేష్ పాల్గొన్నారు.

నేత్రదానం


వెంకటసుబ్బయ్య (ఫైల్)

విడవలూరు: స్థానిక గ్రంథాలయ వీధిలో నివాసం ఉంటున్న మురుగుళ్ల వెంకటసుబ్బయ్య (80) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుమారుడు శ్రీను అంగీకారం మేరకు నేత్రాలను మన సేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమక్షంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కు దానం చేశారు. టెక్నీషియన్ వేణు సేకరించారు.

విద్యార్థికి అభినందన



ఇందుకూరుపేట: కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్ – 14, 17 రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దుర్గాప్రసాద్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ క్రమంలో విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, వ్యాయామ ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

డిగ్రీ పరీక్షలకు 23 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించి డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 23 మంది హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 24 మందికి గానూ ఒకరు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు

దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఈఓ ఉషశ్రీ తెలిపారు. వెంగమాంబ దేవస్థానాన్ని దేవాదాయ శాఖకు చెందిన మురళి, శిల్పి సురేంద్ర శుక్రవారం సందర్శించారు. దేవస్థానంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్లాన్లు, అంచనాల తయారీకి కొలతలు సేకరించారు. ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి అంచనాలు రూపొందించి ఎమ్మెల్యే సిఫార్సుతో టీజీఎఫ్ నిధులు, దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని ఈఓ తెలిపారు. కాగా ఈ నెల 25న కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని దొడ్డకొండపై ఉన్న వెంగమాంబ విగ్రహం వద్ద పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహానైవేద్యం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ వివరించారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

అల్లూరు: ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల కలిగే ప్రమాదాలపై ముందస్తు అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చని ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దరియప్ప పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో బాధితులను కాపాడడం, ప్రథమ చికిత్సను అందించడం, తదితర అంశాలపై మాక్‌డ్రిల్ చేసి చూపించారు. మెరైన్ సీఐ డి.ప్రసాద్, ఎస్సై నాయబ్‌రసూల్, డీటీ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ ప్రభుదీప్, ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని జాతీయ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పులి చెంచయ్య, జిల్లా చైర్మన్ పోలయ్య, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి లోక్‌సాయి, నేతలు మదన్‌రెడ్డి, గోపీరెడ్డి, శ్రీనివాసులునాయుడు, అశోక్‌రెడ్డి, ప్రిన్సిపల్ విష్ణుప్రియ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మనుబోలు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన నాయకులు తెలిపారు. 'ఏళ్ల నాటి గ్రంథాలయం.. వసతులు ఘోరం' అనే శీర్షికపై శుక్రవారం సాక్షిలో వెలువడిన కథనానికి వారు స్పందించారు. ఆ పార్టీ నాయకుడు సురేష్ మాట్లాడుతూ తక్షణమే గ్రంథాలయానికి మరమ్మతులు చేయించాలన్నారు. ఈ ఆవరణలోని ఏసీ సుబ్బారెడ్డి పార్క్‌లో కొందరు మద్యం తాగుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పోలీసులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో వాణి భవానీ, శ్రీలక్ష్మి, చెలికం కోటేశ్వరరెడ్డి, ఖాదర్‌వలీ, శ్రీహరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.4 లక్షల దుర్వినియోగం


విచారణ చేస్తున్న అధికారులు

మనుబోలు: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.4 లక్షలు దుర్వినియోగమైందని, ఈ మొత్తాన్ని రికవరీ చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి నిధులతో చేపట్టిన పనులపై గత నెల 4 నుంచి 17 తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం బహిరంగ విచారణ చేపట్టారు. డ్వామా పీడీ గంగా భవానీ మాట్లాడుతూ రూ.6 కోట్ల విలువైన పనులు చేసినట్లు తెలిపారు. సోషల్ ఆడిట్ రికార్డులను అధికారులు చదివి వినిపించగా ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మస్టర్లు సక్రమంగా వేయలేదని, పనులకు వెళ్లకపోయినా తమ పేర్లు నమోదు చేసుకుని నగదు డ్రా చేసుకున్నారని పలువురు ఆరోపించారు. కాగా వీరంపల్లి గ్రామంలో దుర్వినియోగమైన రూ.2.79 లక్షల నగదును రికవరీ చేస్తామని సోషల్ ఆడిట్ రాష్ట్ర ఆర్పీ నాగరాజు తెలిపారు. రూ.4 లక్షలు మాత్రమే దుర్వినియోగమైనట్లు అధికారులు ప్రకటించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎస్క్యూసీఓ సతీష్‌బాబు, అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి, ఏపీడీ శంకరనారాయణ, డీవీఓ జయలక్ష్మి, ఎంపీడీఓ జలజాక్షి, ఏపీఓ రాజమ్మ, టీఏ సుప్రజ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం

- కలెక్టర్ ఆనంద్


సమస్యలను ఆరాతీస్తున్న ఆనంద్

విడవలూరు: ఎస్టీల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మండలంలోని పార్లపల్లిలో గల ఎస్టీ కాలనీని శుక్రవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణం, ఆధార్, రేషన్ కార్డులు, ఉపాధి హామీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు. అనంతరం అక్కడ నివసిస్తున్న గిరిజనులతో ముచ్చటించారు. ఒకే పూరి గుడిసెలో రెండు, మూడు కుటుంబాలు కలిసి ఉంటున్నామని, తమకు ఇళ్లు కేటాయించాలని వారు కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సుబ్బారెడ్డిపాళెం బ్రిడ్జి


అప్రోచ్ రోడ్డు వద్ద ఇలా..

ముత్తుకూరు: ముత్తుకూరు – వెంకటాచలం మండలాలను కలిపే సుబ్బారెడ్డిపాళెం బ్రిడ్జి ప్రమాదకరంగా తయారైంది. 25 ఏళ్ల క్రితం గాదెలవాగుపై నిర్మించిన ఈ భారీ వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముత్తుకూరు నుంచి ఈ బ్రిడ్జి మీదుగా పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం గ్రామాలతోపాటు పోర్టు బైపాస్‌రోడ్డుకు చేరుకోవాలి. ముఖ్యంగా పోర్టు బైపాస్‌రోడ్డులోని పామాయిల్ ఫ్యాక్టరీలకు కూడా దీని మీదుగానే ప్రయాణం సాగించాలి. అయితే బ్రిడ్జికి ఇరువైపులా అంచులు దెబ్బతినడం, మధ్యలో పొడవైన కోత ఏర్పడడంతో వల్ల ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


బ్రిడ్జి మధ్యలో గుంత

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ కృష్ణకాంత్



కోవూరు: మాట్లాడుతున్న కృష్ణకాంత్

కోవూరు: మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. కోవూరులోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలను విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, కళాశాల సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని కొడవలూరు సీఐ సురేంద్రబాబు పేర్కొన్నారు. మాదకద్రవ్యాలతో సంభవించే అనర్థాలపై మండలంలోని నార్తురాజుపాళెంలో గల లెండీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీటికి బానిసలైతే సమాజంలో గౌరవం కోల్పోవడంతో పాటు కుటుంబపరువుకు తీవ్ర భంగం కలుగుతుందని చెప్పారు. ఎస్సై కోటిరెడ్డి, కరస్పాండెంట్ శశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ నాశనం

పొదలకూరు: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, లేకపోతే భవిష్యత్ నాశనమవుతుందని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో శుక్రవారం మాదక ద్రవ్యాల నివారణ, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మోటార్ వెహికల్ చట్టం, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో ఉన్నతంగా చూడాలని కలలు కంటారన్నారు. అయితే కొందరు యువకులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నట్టు తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి ఆట కట్టించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని 112 లేదా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. యువత చిన్నపాటి విషయాలకే కలత చెంది ఆత్మహత్యకు పాల్పడవద్దని, ధైర్యంగా ముందుకు సాగాల్సిందిగా పేర్కొన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎస్సై ఎస్‌కే ఎండీ హనీఫ్ మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. లోన్ యాప్‌ల జోలికి వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీఎస్ రెడ్డి, డీన్ చల్లా వెంకటకృష్ణ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

మనుబోలు: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శివరాకేష్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఫోన్‌కు వచ్చే లింక్‌లపై క్లిక్ చేయొద్దన్నారు. వ్యక్తిగత విషయాలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయొద్దన్నారు. బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


కొడవలూరులో..


పొదలకూరు: మాట్లాడుతున్న శివరామకృష్ణారెడ్డి


మనుబోలు: మాట్లాడుతున్న ఎస్సై శివరాకేష్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరం మూలాపేట ప్రాంతానికి చెందిన కిశోర్‌బాబు పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో కిశోర్‌బాబు గాయపడగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

తోటపల్లిగూడూరు: గృహ నిర్మాణం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ పీఎంఏవై స్కీం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం పక్కాగృహాలను మంజూరు చేస్తోందన్నారు. సొంత స్థలం ఉండి ఇప్పటి వరకు పక్కాగృహం మంజూరు కాని వారు రేషన్, ఆధార్ కార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ వివరాలతో ఈనెల 30వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యాంటీబయోటిక్స్‌తో తీవ్ర ముప్పు



ఇందుకూరుపేట: యాంటీబయోటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తే మానవాళికి తీవ్ర ముప్పు తప్పదని నాక్సా ఎంపెడా సీఈఓ దియాహున్ కోంగ్లామ్ పేర్కొన్నారు. యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్సీ ప్రాధాన్యంపై ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని గంగపట్నంలో ఎన్సీఎస్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. నాక్సాఎస్ సీఈఓ కిరణ్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ శివరాజన్, ముత్తుకూరు మత్స్యకళాశాల ప్రొఫెసర్ ధన్‌పాల్, వెటర్నరీ వైద్యాధికారి అస్లామ్ అక్తర్, ఫీల్డ్ మేనేజర్లు రవీంద్రబాబు, వెంకటరమణ తదతరులు పాల్గొన్నారు.

4న పరాఖ్ సర్వే


డైట్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం

ఇందుకూరుపేట: పర్ఫార్మెన్స్ అసెస్మెంట్ రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జి ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరాఖ్)పై సర్వేను డిసెంబర్ నాలుగున నిర్వహించనున్నామని జిల్లా సమగ్ర శిక్ష, అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు పేర్కొన్నారు. పరాఖ్‌పై మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేలో భాగంగా మూడు, నాలుగు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు పరీక్షను నిర్వహించనున్నామని చెప్పారు. ఫలితాల ఆధారంగా విద్యా ప్రమాణాలు, కనిష్ట అభ్యసన స్థాయిలు తదితరాలపై అంచనా వేయనున్నారని వెల్లడించారు. కామన్ పరీక్షల బోర్డు జిల్లా కార్యదర్శి రామ్‌కుమార్, డైట్ ప్రిన్సిపల్ రమేష్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.